


కేశవ చూపు కేసీ వైపే..

శ్రీశైలం ప్రాజెక్టు 26.30
68 చిన్నచెరువులు 69.04
కేసీ కెనాల్, కుందూ, నిప్పులవాగు 253.10
అంకెలు రూ.కోట్లలో
ఎస్సార్బీసీ 44.06
గాజులదిన్నె ప్రాజెక్టు 11.79
గురు రాఘవేంద్ర 69.04
శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రం 2.23
సిద్ధేశ్వరం ఎత్తిపోతల 6.29
ఎల్లెల్సీ, ఆర్డీఎస్, వేదవతి ప్రాజెక్టులు 13.00
మొత్తం (రూ.కోట్లలో) 445.81

నంద్యాల/ కర్నూలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం 2024-25 బడ్జెట్ అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. బాధ్యతలు చేపట్టిన తరువాత పూర్తి స్థాయి తొలి బడ్జెట్ ఇది. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వ్యవసాయ బడ్జెట్ ప్రవేశ పెట్టారు. నాలుగు నెలల బడ్జెట్ అయినా.. కరువుతో తల్లడిల్లే కర్నూలు ప్రాజెక్టులకు ఆశాజనకంగా కేటాయింపులు లేవు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లా ప్రాజెక్టులకు రూ.445.81 కోట్లు కేటాయిస్తే అందులో సగానికి పైగా కేసీ కాలువకే కేటాయించారు. ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో కరువు నివారణ లక్ష్యంగా చేపట్టిన వేదవతి లిఫ్ట్, ఆర్డీఎస్ కుడి కాలువ ప్రాజెక్టులు సహా తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు అరకొర నిధులతో సరిపుచ్చారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు కాస్త ఊపిరి పోశారు. గుండ్రేవుల జలాశయం ఊసే లేదు. ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ పథకాల హామీలతో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో ఆ పథకాలకు బడ్జెట్‌లో సముచిత స్థానం కల్పించారు. పేదల సంక్షేమ బడ్జెట్ ఇది అని విత్త మంత్రి పయ్యావుల చాటి చెప్పారు. జిల్లాలో విశ్వవిద్యాలయాలకు జీతాలు, నిర్వహణకు మాత్రమే నిధులు ఇచ్చారు. పయ్యావుల బడ్జెట్‌లో జిల్లాకు కేటాయింపులపై ఆంధ్రజ్యోతి కథనం.



- ఉమ్మడి ప్రాజెక్టులకు రూ.445.81 కోట్ల కేటాయింపులు
- అత్యధికంగా కేసీ కెనాల్‌కు రూ.253.10 కోట్లు
- కర్నూలు జిల్లా ప్రాజెక్టులకు అరకొర నిధులే
- సూపర్ సిక్స్ పథకాలకు అధిక ప్రాధాన్యం
- పయ్యావుల బడ్జెట్‌లో పశ్చిమానికి అన్యాయం





తుంగభద్ర నదిపై గుండ్రేవుల నిర్మించాల్సిన ప్రదేశం ఇదే..

బడ్జెట్ వివరాలు 6లో

బడ్జెట్‌లో కీలకం!

హంద్రీ నీవాకు రూ.812 కోట్లు



హంద్రీ నీవా కాలువ వద్ద అసంపూర్తిగా వేదవతి ప్రాజెక్టు ప్రధాన పంపింగ్ కేంద్రం పనులు

హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోత పథకం ప్రాజెక్టు ఫేజ్-1, ఫేజ్-2 కింద కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలో లైనింగ్, అసంపూర్తి పనులు, పాత బిల్లుల చెల్లింపులు సహా వివిధ పనులు, జలాశయాల నిర్వహణ కోసం రూ.812 కోట్లు కేటాయించారు. మూడు జిల్లాలకు కలిపి కేటాయంపులు చేయడంతో ఏ జిల్లాకు ఎంత అన్నది స్పష్టత లేదు. పత్తికొండ రిజర్వాయర్ కుడి ఎడమ కాలువలు అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు దాదాపు రూ.200 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. వాటికి పరిపాలన అనుమతులు రాలేదు. అదే క్రమంలో హంద్రీనీవా విస్తరణ కోసం ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అంటే.. ఈ బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఫేజ్-2 కింద అనంతపురం, చిత్తూరు జిల్లాలో చేపట్టే పనులకే ఖర్చు చేసే అవకాశం ఉంది. హంద్రీనీవా ఎత్తిపోతల పథకాలకు దాదాపు రూ.3,500 కోట్ల విద్యుత్ చార్జీల బకాయి ఉంది. ఏడాదికి రూ.6-8 కోట్ల వడ్డీ అవుతుంది. విద్యుత్ బిల్లులకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదు.

కందనవోలుకు అరకొర నిధులే..

ఉమ్మడి కర్నూలు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు 2024-25 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రూ.445.81 కోట్లు కేటాయించారు. అందులో నంద్యాల జిల్లాలో శ్రీశైలం ప్రాజెక్టు, కేసీ కాలువ, కుందూ విస్తరణ, ఎస్ఆర్బీసీ, సిద్ధేశ్వరం ఎత్తిపోతల పథకాలకు రూ.329.75 కోట్లు ఇస్తున్నట్టు ప్రకటించగా నిత్యం కరువు, వలసలతో తల్లడిల్లే కర్నూలు జిల్లాలో తుంగభద్ర ప్రాజెక్టు దిగువ కాలువ (ఎల్లెల్సీ), గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకం, ఆర్డీఎస్, వేదవతి, గాజులదిన్నె ప్రాజెక్టులకు రూ.115.39 కోట్లు మాత్రమే కేటాయించారు. ఉమ్మడి జిల్లాకు కేటాయించిన నిధుల్లో అత్యధికంగా కేసీ కాలువకు రూ.253.10 కోట్లు ఇచ్చారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన కుందూ విస్తరణ పనులకు పాత బిల్లుల చెల్లింపులే అధికంగా ఉన్నాయని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. కర్నూలు జిల్లా ప్రాజెక్టులైన వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి ఉంటే తక్షణం భూ సేకరణ చేపట్టి వేసవిలో పనులకు అంకురార్పణ చేసే అవకాశం ఉండేది. ఈ బడ్జెట్‌లో నిధులు ఊసే లేకపోవడంతో ఈ పనులకు మోక్షం లభిస్తుందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యం పెంపు పనులకు బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ ఆపేశారు. బడ్జెట్‌లో రూ.11.79 కోట్లు ఇచ్చారు. కాంట్రాక్టరు బిల్లులు చెల్లించి పనులను మొదలు పెట్టాల్సిన బాధ్యత ఇంజనీర్లు, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డిలపై ఉంది. పత్తికొండ, డోన్ నియోజకవర్గాల్లో 68 చెరువులకు హంద్రీ నీవా కాలువ నుంచి కృష్ణా జలాలు ఎత్తిపోసే ప్రాజెక్టుకు రూ.20 కోట్లు కేటాయించారు. అసంపూర్తి పనులతోపాటు నిర్వహణ సిబ్బందిని నియమించుకునే అవకాశం ఉంది. గుండ్రేవుల జలాశయంపై బడ్జెట్‌లో ఊసే లేకపోవడం రైతులను నిరాశకు గురి చేసింది.

యురేనియం తవ్వకాలు జరగనివ్వం 6 | ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం : ఎస్పీ 7 | అన్నదాత బలవన్మరణం 7



పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం

శ్రీశైలంలో లక్ష దీపోత్సవం

పుష్కరిణికి దశవిధ హారతులు

శ్రీశైలం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒక్కటైన శ్రీశైల మహా క్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కార్తీక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం, పుష్కరిణికి దశవిధ హారతులను దేవస్థానం వైభవంగా నిర్వహించింది. సోమవారం భక్తులు భారీగా తరలిరావడంతో క్షేత్ర వీధులు రద్దీగా కనిపించాయి. భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలిరావడంతో క్షేత్రం శివనామ స్మరణతో మార్మోగింది. వేకువ జాము నుంచే పాతాళగంగలో అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, దీపారాధనలు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులుతీరారు. కాగా ప్రధాన ఆలయం ఎదుట గల గంగాధర మంటపం వద్ద మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ధ్వజ స్తంభానికి ఆకాశ దీపం నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి పర్యవేక్షించారు.



స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించండి

●కలెక్టర్ రాజకుమారి ● పీజీఆర్ఎస్‌కు 195 దరఖాస్తులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి, అధికారులు

నంద్యాల కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతిస్తున్న ప్రజా ఫిర్యాదులను నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ బియాండ్‌ఎస్ఎల్ఏలో ఉన్న 44 దరఖాస్తులను, సీఎంఓ కార్యాలయపు ఫిర్యాదులు 18 మంది అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 195 మంది తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు.

విదేశాలకు మన ఉల్లి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో సాగు చేస్తున్న ఉల్లి విదేశాలకు ఎగుమవుతోంది. ఫలితంగా రైతులకు ఆశించిన ధర దక్కుతోంది. దశాబ్ద కాలంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో పత్తికొండ, ఎమ్మిగనూరు, కోడుమూరు, డోన్, పాణ్యం, ఆలూరు, గోనెగండ్ల, కర్నూలు తదితర నియోజకవర్గాల నుంచి దాదాపు వేల టన్నుల ఉల్లి ఉత్పత్తి జరిగేది. ఈ సరుకునంతా కర్నూలు మార్కెట్ యార్డు నుంచి బంగ్లాదేశ్‌తోపాటు తమిళనాడు, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, కోల్‌కత్తా తదితర ఆరు రాష్ట్రాలకు వ్యాపారులు సప్లయ్ చేస్తున్నారు. ఐదు సంవత్సరాలుగా అతివృష్టి, అనావృష్టితో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఉల్లి రైతులు తీవ్ర కష్ట నష్టాలను ఎదుర్కొన్నారు. ఈ సంవత్సరం సరిపడా వర్షాలు కురవడంతోపాటు తెగుళ్లు ఎక్కువగా వ్యాపించకపోవడంతో ఎకరాకు 60 నుంచి 100 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చింది. మరోవైపు మహారాష్ట్ర, గుజరాత్‌లో ఉల్లి పంట భారీ వర్షాలకు దెబ్బతినడంతో కర్నూలు మార్కెట్ యార్డు నుంచి పెద్దఎత్తున దేశ విదేశాలకు సరఫరా చేస్తున్నారు. క్వింటాకు మూడు వేల నుంచి రూ.4.50 వేల దాకా అందుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు 6లో...

మహానందిలో తొలిసారి జలహారతి

భారీగా తరలివచ్చిన భక్తులు



మహానందిలోని రుద్రగుండం కోనేరు ముందు గంగాదేవికి జలహారతి ఇస్తున్న అర్చకులు

మహానంది, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో కార్తీక రెండో సోమవారాన్ని పురస్కరించుకొని రాత్రి ఆలయం ప్రాంగణంలోని రుద్రగుండం కోనేరు వద్ద వేదమంత్రాలతో వేదపండితులు, అర్చకులు భక్తి శ్రద్ధలతో ప్రధాన ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో హారతులను కోనేరు వద్దకు తీసుకొచ్చారు. అనంతరం గంగాదేవికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మొదటి సారిగా కార్తీక మాసంలో గంగాదేవికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సారె సమర్పించారు. వేదమంత్రాలతో వైభవంగా జలహారతి నిర్వహించారు. ఇందులో భాగంగా అర్చకులు రాజరత్తయ్యబాబు, రాజమాణిక్యశర్మ, కొమ్మద్ది శంకరయ్యశర్మ భక్తిశ్రద్ధలతో జలహారతులు ఇచ్చారు. ఇక నుంచి ప్రతి కార్తీక సోమవారం క్షేత్రంలోని రుద్రగుండం కోనేరు వద్ద గంగాదేవికి జల హారతులు ఇస్తామని ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎర్రమల్ల మధు, పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేశవ చూపు కేసీ వైపు..

బడ్జెట్ - 2024
BUDGET -2024

రోడ్లు భవనాల శాఖకు రూ.9.554 కోట్లు



బడ్జెట్‌లో రోడ్లు భవనాల రంగానికి రూ.9,554 కోట్లు కేటాయించడం హర్షణీయం. సంక్రాంతి పండుగ నాటికి గుంతల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించాం. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రోడ్లు, భవనాల శాఖకు నిధులు కేటాయించి సహకరించారు. రోడ్ల మరమ్మతులను సకాలంలో పూర్తి చేయడానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశాం.

- బీసీ జనార్దన్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి

రోడ్లను బాగు చేసేలా..

నంద్యాల జిల్లాలో దాదాపు 3300 కి.మీ ఆర్‌అండ్‌బీ రోడ్లు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలోని డోన్ నియోజకవర్గానికి మినహా ప్రత్యేకించి గతంలో ఎక్కడా నిధులు కేటాయించిన దాఖలాలు లేవు. దీంతో జిల్లాలోని రోడ్లు అధ్వాన స్థితిని దాటిపోయాయి. వీటి గుండా ప్రయాణించాలంటే ప్రయాణీకులకు, వాహనదారులకు చుక్కలు కనిపించేవి. ఈ పరిస్థితిని మార్చేందుకు ఆర్‌అండ్‌బీకి అధికార పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా రూ.9554 కోట్లు కేటాయించింది. రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపిస్తే జిల్లాకు ఎక్కువ నిధులు వచ్చే అవకాశం ఉంది.

యాంత్రీకరణకు ఊతం

ప్రస్తుత వ్యవసాయ విధానంలో యంత్రాల సాయం లేకుండా అన్నదాతలు వ్యవసాయం సాగించే పరిస్థితి లేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం రైతులకు యంత్రాలు, పనిముట్లను రాయితీపై అందించేందుకు నిధులు కేటాయించింది. ఇదే విధానాన్ని వైసీపీ గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెడుతున్నామంటూ ప్రగల్భాలు పలికి మొదటి మూడు, నాలుగేళ్లు పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రవేశపెట్టిన పథక లబ్ధిని కూడా పూర్తిగా వైసీపీ నేతల అనుభవించారు. ట్రాక్టరు వంటి ముఖ్యమైన వాటిని వైసీపీ నేతలు ఇళ్లలోనే పెట్టుకుని సొంతానికి వాడుకున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పాత పద్ధతులను అవలంభించకుండా పూర్తిగా రైతులకు ఉపయోగపడేలా యంత్రాలను రాయితీపై ఇచ్చి, అందరికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోనుంది.

ప్రాజెక్టుల వారిగా కేటాయింపులు రూ.కోట్లలో

ప్రాజెక్టులు	2022-23	2023-24	2024-25
ఎల్లెల్సీ, ఆర్డీఎస్, వేదవతి ప్రాజెక్టులు	22.00	80.94	13.00
కేసీ కెనాల్, కుందూ, నిప్పులవాగు	70.60	224.44	253.10
ఎస్ఆర్‌బీసీ	55.07	38.38	44.06
గురురాఘవేంద్ర ప్రాజెక్టు	22.83	24.65	69.04
68 చెరువులు	10.50	56.50	20.00
గాజులదిన్నె ప్రాజెక్టు	10.35	19.00	11.79
శ్రీశైలం జల విద్యుత్ కేంద్రం	6.00	5.34	2.23
సిద్ధేశ్వరం ఎత్తిపోతల పథకం	5.22	5.52	6.29
శ్రీశైలం ప్రాజెక్టు	23.63	21,27	26.30
మొత్తం	226.20	476.04	445.81

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట



రాష్ట్ర బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. బడ్జెట్‌లో మైనార్టీలకు రూ.4376కోట్లు కేటాయించారు. గతంలో మైనార్టీలకున్న పథకాలన్నింటినీ తిరిగి పునరుద్ధరించి అమలు చేయనున్నారు.

- మౌలానా ముస్తాక్ అహమ్మద్, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్

వర్సిటీ అభివృద్ధిని విస్మరించారు



జిల్లాలో మూడు విశ్వవిద్యాలయాలు ఉన్నా వాటి అభివృద్ధిని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విస్మరించారు. రాయలసీమ వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది జీతాలు, నిర్వహణ ఖర్చులకు రూ.10.45 కోట్లు కేటాయించారు. దక్షిణ భారత దేశంలోనే తొలి క్లస్టర్ విశ్వవిద్యాలయానికి రూ.1.40 కోట్లు కేటాయించారు. అది కూడా జీతాలకు ఒక్కటే. జగన్నాథ గట్టుపై 54 ఎకరాల్లో నిర్మిస్తున్న క్లస్టర్ వర్సిటీ నూతన భవనానికి ఒక్క పైసా ఇవ్వలేదు. దీంతో నిర్మాణాలు అసంపూర్తిగా ఆగిపోక తప్పని పరిస్థితి. గత ఏడాది బడ్జెట్‌లో రూ.39 కోట్లు కేటాయిస్తే తాజాగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ జీరో పద్దు చూపించారు. ఉర్దూ విశ్వవిద్యాలయం సిబ్బంది జీతాలకు రూ.2.80 కోట్లు కేటాయిస్తే భవన నిర్మాణానికి రూ.1.50 కోట్లు ఇచ్చారు. ఓర్వకల్లు వద్ద గత టీడీపీ ప్రభుత్వంలో 110 ఎకరాల్లో నిర్మాణం చేపడితే.. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఒక్క ఇటుక కూడా వేయలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ రావడంతో ఉర్దూ విశ్వవిద్యాలయం భవనాల నిర్మాణం మొదలై వేగంగా పనులు చేపడతారని ఆశిస్తే అరకొర నిధులతో సరిపుచ్చారు. అయితే.. ఈ నిధులు నాలుగు నెలలకే అని.. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రవేశ పెట్టే 2025-26 బడ్జెట్‌లో సముచిత స్థానం దక్కుతుందని టీడీపీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అలాగే.. స్టేట్ క్యాన్సర్ యూనిట్, కర్నూలు సర్వజన వైద్యశాల, బోధనాస్పత్రికి దాదాపుగా రూ.56 కోట్లు కేటాయించారని అధికారులు పేర్కొన్నారు.

వేదవతి, గుండ్రేవుల పట్ల నిర్లక్ష్యం



వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులను పూర్తి చేయడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లా ప్రాజెక్టుల గురించి ప్రస్తావించకపోవడం దారుణం. జిల్లా ప్రజలను కూటమి ప్రభుత్వం మరోసారి మోసం చేసింది. జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు యువత ఉద్యమాలకు సిద్ధం కావాలి.

- బి.గిడ్డయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి

రాష్ట్ర బడ్జెట్‌లో యువతకు అన్యాయం



రాష్ట్ర బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం యువతకు తీవ్ర అన్యాయం చేసింది. గత ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడలో పూర్తిగా వైఫల్యం చెందింది. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్ ఆర్భాటంగా రూ.2 లక్షల కోట్లు ఉంటే అందులో యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖకు రూ.322 కోట్లు కేటాయించడం సిగ్గుచేటు.

- నక్కీ లెనిన్‌బాబు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

సూపర్ సిక్స్ పథకాలకు నిధులు కేటాయించలేదు

అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో సూపర్‌సిక్స్ పథకాలకు నిధుల కేటాయించలేదు. మద్యం, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడం, ప్రజలపై పన్నులు వేయడం ద్వారా నిధులు సేకరించాలనే ప్రతిపాదనలు చేశారు. నిరుద్యోగులకు నెలకు రూ3000 ఇస్తామనే హామీకి తగిన నిధులు బడ్జెట్‌లో కేటాయించలేదు. తల్లికి వందనం పథకానికి రూ 12,480 కోట్లు అవసరమైతే కేవలం రూ 5300 కోట్లు మాత్రమే కేటాయించారు.

-రమేష్ కుమార్, సీసీఎం జిల్లా కార్యదర్శి, నంద్యాల

ఎన్నికల హామీలపై స్పష్టతలేని బడ్జెట్



తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తుందో బడ్జెట్‌లో కనీస ప్రస్తావన చేయకపోవడం బాధాకరం. దళితులు, మహిళలు, మైనార్టీల సంక్షేమానికి నామమాత్రంగా నిధులు కేటాయించడం చూస్తే ప్రభుత్వానికి వారి పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో తెలుస్తోంది. నిరుద్యోగ భృతి ఇస్తామన్న వాగ్దానాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. గత ప్రభుత్వంపై విమర్శలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు.

- డి.గౌస్ దేశాయ్, సీపీఎం జిల్లా కార్యదర్శి



శిక్షణ పొందుతున్న మహిళలు

భవితకు భరోసా

- నైపుణ్య శిక్షణ నిరుద్యోగ యువతకు వరం
- జాబ్‌మేళాలతో వందల మందికి ఉపాధి

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్షరాస్యుల శాతానికి సమాంతరంగా నిరుద్యోగం వృద్ధి చెందుతోంది. డిగ్రీ, ఇంజనీరింగ్ పూర్తి చేసిన పట్టభద్రులు జిల్లా వ్యాప్తంగా దాదాపు 80 వేల మంది ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి వారికి ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తోంది. ఇప్పటికే కొన్ని వేల మందికి వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ప్రయోజకులుగా తీర్చిదిద్దింది. వార్షిక లక్ష్యాలకు అనుగుణంగా శిక్షణ తరగతులు నిర్వహించి, వారికి ప్రత్యేకమైన జాబ్‌మేళా ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది.

నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యం

- 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ పేరుతో ప్రతి జిల్లాలో ఒక కార్యాలయం, నియోజకవర్గానికి ఒక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో అవసరార్థుల అర్హత, ఆసక్తులే ప్రామాణికంగా కోర్సులను ప్రవేశపెట్టింది. అరకొర అక్షర జ్ఞానం ఉన్న వారికి సైతం ఇక్కడ తగిన కోర్సులతో శిక్షణ ఇవ్వటం గమనార్హం. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా వారికి మార్గనిర్దేశనం చేస్తోంది. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే 51 బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వగా 601 మంది విద్యార్థులు శిక్షణ పూర్తి చేసుకున్నారు. మరో 407 మంది కోర్సులో ఉన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 13 జాబ్‌మేళాలు ఏర్పాటు చేయగా, 63 పేరెన్నికగన్న కంపెనీలు పాల్గొన్నాయి. 711 మంది యువతకు ఉపాధి లభించింది. 2019 నుంచి 2024 మధ్య వైఎస్సార్ ప్రభుత్వం హయాంలో ఈ సంస్థ పూర్తిగా నిర్వీర్యమైంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువు తీరటంతో ఈ సంస్థకు నూతనోత్సాహం వచ్చినట్లయింది.

పలు రకాల కోర్సుల్లో శిక్షణ

జిల్లాలోని కళాశాలలు, విశ్వవిద్యాలయాలను ఆధారంగా చేసుకుని మానవ వనరుల ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకుని పలు కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. అరకొర చదువులు చదివిన వారికి వారి ప్రతిభ ఆధారంగా మెలకువలు నేర్పి, వారు ఎన్నుకున్న రంగంలో శిక్షణనిచ్చి నిష్ణాతులను చేస్తున్నారు. ప్రధానంగా ఎన్‌ఏసీ (న్యాక్) సంస్థతో అనుసంధానం చేసుకుని ప్రత్యేకించి భవన నిర్మాణరంగంలో తర్ఫీదు ఇస్తున్నారు. బేల్దారి, పెయింటింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, సర్వేయర్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇవ్వటంతోపాటు ఉపాధి కల్పిస్తున్నారు. లేనిపక్షంలో విశ్వకర్మ యోజన పథకం ద్వారా వారికి వ్యక్తిగత రుణాలను మంజూరు చేయించి స్వయం ఉపాధికి బాటలు వేస్తున్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, ఆపై చదివిన విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్‌తో పాటు కంప్యూటర్ శిక్షణ ఇచ్చి వారి అర్హతకు అనుగుణంగా, స్థానికంగా, ఇతర రాష్ట్రాలు, పెద్ద నగరాల్లోని కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు వచ్చేలా తయారు చేస్తున్నారు. మహిళలకు సైతం స్థానికంగానే పేరుగాంచిన షాపింగ్ మాల్, నగల దుకాణాల్లో గౌరవ వేతనం అందేలా తోడ్పాటును అందిస్తున్నారు. మహిళలు తమకు నచ్చిన, ప్రవేశం ఉన్న రంగాల్లో రాణించేలా మెలకువలు నేర్పించి ఇంటి వద్దనే ఉపాధి పొందేలా కుట్టు, అల్లికలు, బ్యూటీషియన్, వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. వీరికి అవసరమైతే ముద్ర రుణాల ద్వారా ఆర్థిక సహకారం ఇస్తూ వారి ఉన్నతికి మరింత ప్రోత్సాహం అందిస్తున్నారు.

గౌరవంగా జీవిస్తున్నాను



ఉచిత శిక్షణే కదా అని ఖాళీ సమయంలో కాలక్షేపానికి కోర్సులో చేరాను. సరదాగా తీసుకున్న శిక్షణ నేడు కుటుంబ పోషణకు ఎంతో ఆధారంగా నిలుస్తోంది. కోర్సు అనంతరం అక్కడ ఇచ్చిన సర్టిఫికెట్లు ఉద్యోగానికి ఎంతో ఉపయోగం పడ్డాయి. ప్రస్తుతం హిమాచల్‌ప్రదేశ్‌లో రూ.30 వేల జీతంతో గౌరవంగా జీవిస్తున్నాను.

- చిన్నయ్య, సర్వేయర్, హిమాచల్ ప్రదేశ్


శిక్షణ ఎంతో తోడ్పడింది



చదివిన చదువుకు.. చేస్తున్న ఉద్యోగానికి ఎటువంటి సంబంధం లేదు. కేవలం సాఫ్ట్ స్కిల్స్, కంప్యూటర్ శిక్షణ తీసుకోవటం వల్ల వినియోగదారులతో ఎలా మాట్లాడాలి, ప్రజా సంబంధాలు ఎలా నిర్వహించాలి అనే విషయాలపై అవగాహన, అనుభవం వచ్చింది. దీంతో మారుతీ కంపెనీలో ఉద్యోగ అవకాశం వచ్చింది. ప్రస్తుతం రూ.25 వేల వరకు జీతం వస్తోంది. వృత్తి అనుభవం అనేది భవిష్యత్తులో మరింత ఉపయోగపడనుంది. ఈ శిక్షణ నాకు ఎంతో తోడ్పడింది.

-శేషాద్రి, మారుతీ కంపెనీ, బెంగళూరు

నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం



నిరుద్యోగాన్ని నిర్మూలించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందే నైపుణ్యాభివృద్ధి సంస్థ. స్థానికంగా ప్రతిభకు ప్రోత్సాహం లేక సరైన శిక్షణ కరువై జీవన చక్రం తారుమారయ్యే పరిస్థితులు తలెత్తకుండా ఉండాలనే సదుద్దేశంతోనే టీడీపీ ప్రభుత్వం ఈ సంస్థను ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఇప్పటికే కొన్ని వందల మంది తమ జీవితాలకు రక్షణ లభించేలా ఉద్యోగభద్రత కల్పించుకున్నారు. చాలా వరకు ఈ సంస్థ నిరుద్యోగులకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నా సరైన అవగాహన లేక వారు ముందుకు రావటం లేదు. వారిని చైతన్యుల్ని చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతాం. నిరుద్యోగులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- అనంద్ రాజ్‌కుమార్, డీఎస్‌డీవో

యురేనియం తవ్వకాలు జరగనివ్వం

- కలెక్టరేట్‌కు తరలి వచ్చిన ప్రభావిత గ్రామాల ప్రజలు
- తవ్వకాలు చేయబోమని ప్రకటించాలి: నాయకుల డిమాండ్



కర్నూలు న్యూసిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యురేనియం తవ్వకాలను జరగనివ్వబోమని దేవనకొండ మండల ప్రజలు తేల్చి చెప్పారు. మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో యురేనియం తవ్వకాలు చేసేందుకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో కప్పట్రాళ్ల, కోటకొండ, నెల్లిబండ, గుండ్లకొండ, గుడిమరాళ్ల, చెలెల్ల చిలిమిలా, బేతపల్లి గ్రామాల ప్రజలు సోమవారం కలెక్టరేట్ ముందు ఆందోళనకు దిగారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ముందుగా సుందరయ్య కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చారు. కలెక్టరేట్ ఎదుట కొద్దిసేపు రాస్తారోకో నిర్వహించారు. పచ్చని గ్రామాల్లో చిచ్చుపెడుతున్నారని, యురేనియం తవ్వకాలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. తమ ప్రాంతంలో యురేనియం తవ్వకాలు వద్దని, తమ పిల్లల భవిష్యత్తును కాపాడాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళా సంఘం రాష్ట్ర నాయకులరాలు నిర్మలమ్మ మాట్లాడుతూ 20 రోజుల నుంచి మండల ప్రజానీకం తీవ్ర ఆందోళనతో ఉద్వేగానికి గురవుతున్నారన్నారు. కలెక్టర్ వచ్చి స్పష్టమైన హామీ ఇస్తేనే అందరు వెళ్లిపోతారని అన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ నవ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రస్తుతం ఎలాంటి తవ్వకాలు చేపట్టడం లేదన్నారు. ప్రజాభిప్రాయం మేరకే యురేనియం తవ్వకాలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల ఆందోళనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామక్రిష్ణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన గ్రామస్థులతో మాట్లాడుతున్న జేసీ నవ్య

- కప్పట్రాళ్ల చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక అండగా ఉంటుందని వేదిక కన్వీనర్ రామక్రిష్ణారెడ్డి అన్నారు. ఐక్యవేదిక అధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యురేనియం తవ్వకాలు నిలుపుదల చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని అన్నారు. యురేనియం తవ్వకాల వల్ల గాలి, నీరు, వాతావరణ పర్యావరణం పంటలు మొత్తం కలుషితమవుతుందని తెలిపారు. ప్రజల కోసం ప్రజాప్రతినిధులు వారి పదవులు త్యాగం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, నాయకులు శ్రీనివాసరావు, రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం, ఎస్‌డీపీఐ జిల్లా నాయకులు చాంద్‌బాషా, వకీల్ బాషా, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌కు భారీగా తరలి వచ్చిన యురేనియం ప్రభావిత గ్రామాల ప్రజలు



ర్యాలీగా వెళ్తున్న సీపీఐ నాయకులు

విదేశాలకు మన ఉల్లి

(5వ పేజీ తరువాయి)



గతంలో కర్నూలు మార్కెట్ యార్డుకు వ్యాపారుల ఒత్తిడి కారణంగా రైతులు ట్రాక్టర్లలో ఎటువంటి సంచుల్లో నింపకుండా అలాగే తెచ్చి కర్నూలు మార్కెట్‌యార్డులో ప్లాట్‌ఫారాలు, రోడ్లపై నిల్వ చేసేవారు. ఐదారు వేల క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి వస్తేనే యార్డులో ఉన్న ప్లాట్‌ఫారాలు, రోడ్లు ఉల్లితో నిండిపోయేవి. యార్డులో తిరగడానికి కూడా ఇబ్బందులు తలెత్తేది. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కించేందుకు ప్రస్తుత మార్కెట్ కమిటీ యార్డు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి గతంలో ఇక్కడ పని చేసినప్పుడు సంచుల్లో ఉల్లిని తీసుకువచ్చేలా చర్యలు తీసుకున్నారు. దీంతో స్థలాభావం కొరత తీరిపోయింది. అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎంత ఉల్లి వచ్చినా కొనుగోలు చేస్తాం



గతంలో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి కాకుండా పక్క జిల్లాలైన నంద్యాల, అనంతపురంతోపాటు తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా రైతులు ఐదారు వేల దాకా క్వింటాళ్ల ఉల్లిని తీసుకువచ్చేవారు. ఆ మొత్తం ఉల్లిని నిల్వ చేసేందుకు తాము ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. సంచుల్లో నింపిన ఉల్లిని కొనుగోలు చేసే పద్ధతిని అమలులోకి తీసుకురావడం వల్ల ప్రస్తుతం పది వేల క్వింటాళ్ల ఉల్లి మార్కెట్‌యార్డుకు రైతులు తెచ్చినా స్థలాభావం సమస్య ఎదురు కావడం లేదు. రైతులు పండించిన ఉల్లి పంటకు ప్రస్తుతం మంచి ధర లభిస్తోంది.

- జయలక్ష్మి, సెక్రటరీ

వ్యక్తికి జైలు

నంద్యాల క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి జైలు శిక్ష విధించినట్లు టూ టౌన్ సీఐ షేక్ ఇస్మాయిల్ తెలిపారు. నంద్యాల పట్టణం విశ్వనగర్‌కు చెందిన షేక్ బసిరుల్ల అలియాస్ బషీర్ అనే వ్యక్తి పట్టణంలోని శ్రీరామ థియేటర్ వద్ద మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజుల జైలు శిక్ష విధించారని తెలిపారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడుగురిపై రౌడీ షీట్స్ తెరిచేందుకు ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు.


మూర్ఛ వ్యాధితో బాలుడి మృతి

మహానంది, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహానందిలో మూర్ఛ వ్యాధితో ఓ బాలుడు మృతి చెందాడు. అనంతపురం జిల్లా పుట్లూరు మండలం శనగల గూడురుకు చెందిన హరి కుమార్ రెడ్డి, నాగజ్యోతి దంపతులు కుమారుడు చక్రధర్‌రెడ్డి(9)తో సోమవారం మహానందికి వచ్చారు. కోనేరులో స్నానాలు చేస్తున్న సమయంలో బాలుడు మూర్ఛ వ్యాధికి గురయ్యాడు. తల్లిదండ్రులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

141 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 141 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం అమలవుతున్నదని కలెక్టర్ పి. రంజిత్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం స్టాల్‌ను కలెక్టర్ ప్రారంభించారు. స్టాల్‌లో ఏర్పాటు చేసిన ఆహార ఉత్పత్తులు, కూరగాయలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 వేల ఎకరాల్లో రసాయనాలు లేకుండా పంటలు సాగవుతున్నాయని అన్నారు. 20 సెంట్ల విస్తీర్ణంలో చిన్న కమతాల్లో ప్రకృతి వ్యవసాయం అమలు ఏటీఎంల ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మి, రైతు సాధికార సంస్థ డీపీఎం చంద్ర శేఖర్, కన్సల్టెంట్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

న్యుమోనియాతో జాగ్రత్త



- ప్రమాదకరంగా మారుతున్న కేసులు
- బాధితుల్లో చిన్నారులే ఎక్కువ
- నేడు వరల్డ్ న్యుమోనియా డే

కర్నూలు హాస్పిటల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): న్యుమోనియా ఒక తీవ్రమైన అంటువ్యాధి. ఇది దగ్గు, తుమ్ముల ద్వారా శ్వాసకోశ వ్యవస్థకు వేగంగా వ్యాపిస్తుంది. ఈ ప్రమాదకరమైన వ్యాధి పిల్లలకు ఎక్కువగా వస్తుంది. వాతావరణంలో మార్పులు, వాయు కాలుష్యం వల్ల సాధారణంగా సీజన్ మారేటప్పుడు, ఇమ్యూనిటీ శక్తి తక్కువగా ఉండే పిల్లల్లో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. డబ్ల్యుహెచ్‌వి నివేదిక ప్రకారం ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది 8.30 లక్షల మంది ఐదేళ్లలోపు చిన్నారులు న్యుమోనియాతో మరణిస్తున్నారు. పెద్దలు, పిల్లలకు అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం నవంబరు 12న వరల్డ్ న్యుమోనియా దినాన్ని నిర్వహిస్తున్నారు.

న్యుమోనియా నివారణకు ప్రపంచవ్యాప్తంగా ప్రచారం జరుగుతోంది. ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి శ్వాస గణనలు -న్యుమోనియాను దాన్ని ట్రాక్‌లో ఆపండి అనే నినాదాన్ని ఇచ్చింది. ప్రతి శ్వాస ప్రాముఖ్యతను తెలుసుకుని వ్యాధిని ముందుగా గుర్తించడం, చికిత్స చేయించుకోవడం చాలా ముఖ్యం.

న్యుమోనియాను ఎదుర్కోవాలంటే ముందు దాని లక్షణాలు అందరికీ తెలిసి ఉండాలి.

లక్షణాలు

- శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది
- గుండె వేగంగా కొట్టుకోవడం
- జ్వరం, వణుకు, చెమటలు
- దగ్గు, ఆయాసం, కడుపు ఉబ్బరం
- ఛాతి నొప్పి, తలనొప్పి, వాంతులు.

న్యుమోనియా చికిత్స

ఈ వ్యాధి కొన్నిసార్లు ప్రాణాంతకం కావచ్చు. అందుకు తొలిదశలోనే గుర్తించాలి. ఐదేళ్లలోపు వయస్సు ఉన్న పిల్లల్లో న్యుమోనియాను త్వరగా తెలుసుకోవాలి. ఛాతీనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే వెంటనే అప్రమత్తం కావాలి. బ్యాక్టీరియా వల్ల సోకే న్యుమోనియాకు యాంటి బయోటిక్స్ ద్వారా చికిత్స అందించవచ్చు. అయితే వ్యాధి తీవ్రమైతే హాస్పిటల్‌లో తప్పక చేర్చాలి. ఎక్కువ విశ్రాంతి తీసుకోవడం, నీరు ఎక్కువగా తాగడం, వంటి చర్యలతో న్యుమోనియా రోగులు త్వరగా కోలుకోవచ్చును.

పెద్దాసుపత్రిలో పెరిగిన బాధితులు



సీజన్ మారడంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు న్యుమోనియా బాధితుల సంఖ్య పెరిగింది. ఆసుపత్రికి వచ్చే ఓపీ రోగుల్లో 10 శాతం బాధితులు ఉన్నారు. ఇక చిన్న పిల్లల విభాగంలో ప్రతి రోజు ఓపీకి 300 మంది పిల్లలు వస్తుండగా.. అందులో 100 మంది న్యుమోనియాతో బాధపడేవారు. ఉన్నారు. అడ్మిషన్లల్లో కూడా చిన్న పిల్లలు 30 శాతం మంది చేరడం వ్యాధి తీవ్రతకు అద్దం పడుతుంది. చిన్న పిల్లలకు నెలలోపు పిల్లలకు ఎస్ఐసీయూ వారు చిన్నపిల్లలకు పీఐసీయూ యూనిట్‌లో నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉంచి ఆక్సిజన్ అంఇస్తూ నెబులైజేషన్ పెట్టి చికిత్స అందిస్తున్నారు.

కడుపులో కదలికలు

పిల్లల కడుపులో కదలికలను తల్లిదండ్రులు గమనిస్తుండాలని వైద్యులు సూచిస్తున్నారు. అప్పుడే పిల్లల శ్వాస ఎలా ఉందో తల్లిదండ్రులకు తెలుస్తుంది. జలుబు వల్ల కూడా శ్వాసలో తేడా రావొచ్చు. వ్యాక్సినేషన్ సాయంతో చిన్న పిల్లల్లో న్యుమోనియాను అడ్డుకోవచ్చు. న్యుమోకాకల్ సూక్ష్మ జీవుల నుంచి వచ్చే న్యుమోనియాను అడ్డుకునేందుకు న్యుమోకాకల్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. మరో వైపు ఫ్లూ వ్యాక్సిన్‌ను వేయిస్తే వ్యాధి ముప్పును అడ్డుకోవచ్చును.

న్యుమోనియాను త్వరగా గుర్తించాలి

న్యుమోనియా వ్యాధిని నాలుగు రోజులలోపే గుర్తించాలి. వెంటనే చికిత్స తీసుకోవాలి. అన్ని రకాల న్యుమోనియా ప్రాణాంతకం కాదు. అందుకే తొలి దశలోనే గుర్తించాలి. మూడు రోజుల నుంచి జ్వరం, దగ్గు, ఊపిరి ఆడకపోవడం వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి.

- డా.రఫీక్ అహ్మద్, చిన్న పిల్లల వైద్యనిపుణుడు, కిమ్స్ హాస్పిటల్, కర్నూలు.



ఇది శ్వాసకోశ వ్యాధి

న్యుమోనియా శ్వాసకోశ వ్యాధి. దీన్ని నిర్లక్ష్యం చేస్తే ఊపిరితిత్తులు దెబ్బతిని శరీరంలోని ప్రధాన అవయవాలపై ప్రభావం చూపుతుంది. ప్రత్యేకించి చిన్న పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. **- డా.ఆర్. మురార్జీ, చిన్న పిల్లల వైద్యనిపుణుడు, కర్నూలు మెడికవర్ హాస్పిటల్**



30 శాతం మంది న్యుమోనియా బాధితులు



చిన్న పిల్లల విభాగానికి వచ్చే రోగుల్లో 30 శాతం న్యుమోనియాతో బాధపడుతుంటారు. అడ్మిషన్లలో 20 మందిలో 8 నుంచి 10 మంది చిన్న పిల్లలు చేరుతుం టారు. చలికాలంలో, సీజన్ మారేటప్పుడు చిన్నపిల్లల్లో ఈ కేసులు అధికమవుతుంటాయి. ముఖ్యంగా చిన్న పిల్లల్లో ఆయాసం వస్తే దాని తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే హాస్పిటల్‌లో చేర్పించాలి. కర్నూలు జీజీహెచ్‌లో న్యుమోనియా వ్యాధికి మెరుగైన వైద్యం అందుబాటులో ఉంది. ఆక్సిజన్, నెబులైజల్ యాంటీబయోటిక్ మందులు వెంటిలేటర్ సౌకర్యాలు ఉన్నాయి. **- డా.బంగి విజయానందబాబు, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, చిన్న పిల్లల విభాగం, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి**

వారోత్సవాలను విజయవంతం చేద్దాం



గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా పౌర గ్రంథాలయ శాఖ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహించుకుంటున్నామని అన్నారు. బాలల దినోత్సవం రోజు నవంబరు 14న జాతీయ పతాక ఆవిష్కరణ, ర్యాలీ, 15న వ్యాసరచన పోటీలు, పుస్తక ప్రదర్శన, పురాతన నాణ్యాల ప్రదర్శన, 16న చిత్రలేఖన పోటీలు, 17న కవి సమ్మేళనం, 18న ప్లాస్టిక్ ప్రయోజనాలు, నష్టాల గురించి వక్తృత్వ పోటీలు, 19న మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల సంరక్షణ, నృత్య ప్రదర్శన, 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన, సామూహిక స్వీయ పఠనంతో వారోత్సవాలను ముగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర గ్రంథాలయ సంస్థ సెక్రటరీ ప్రకాష్, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, సీనియర్ అసిస్టెంట్ మక్బూల్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

గోనెగండ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేముగోడు గ్రామం దగ్గర సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహేష్(28) అనే వ్యక్తి మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. వేముగోడు గ్రామానికి చెందిన మహేష్, సుగ్నానం ఇద్దరు తమ ద్విచక్ర వాహనంలో వేముగోడు నుంచి కోడుమూరుకు వెళ్లారు. అక్కడ పని ముగించుకొని పొద్దుపోయాక ద్విచక్ర వాహనంలో వేముగోడుకు బయలుదేరారు. గ్రామ శివారులోకి రాగానే ఎమ్మిగనూరు వైపు నుంచి కోడుమూరుకు వెళ్తున్న కారు వేగంగా వచ్చి మహేష్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో మహేష్, సుగ్నానంలు ఎగిరి రోడ్డుపై పడ్డారు. మహేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సుగ్నానంకు తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలోని ప్రజలు అక్కడకు చేరుకొని 108 వాహనం ద్వారా సుగ్నానం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగధర్ తెలిపారు.



మహేష్ (ఫైల్)

‘ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరిస్తాం’



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రాణా

నంద్యాల క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరిస్తామని నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి 85 ఫిర్యాదులను స్వీకరించారు. అందినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ఈ సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

మోటార్ సైకిళ్ల దొంగ అరెస్టు

- 20 బైక్‌ల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్డీపీఓ ఎన్.యుగంధర్‌బాబు ఆధ్వర్యంలో నంద్యాల వన్‌టౌన్ సీఐ జి.సుధాకర్‌రెడ్డి, సీసీఎస్ సీఐ సురేష్‌కుమార్, సిబ్బంది మోటార్‌సైకిళ్ల దొంగను అరెస్ట్ చేశారు. సోమవారం ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహానంది మండలం బసవాపురానికి చెందిన కాలే వెంకటరమణ నంద్యాల, ప్రకాశం జిల్లాల్లో మోటార్‌సైకిళ్ల దొంగతనాలకు పాల్పడేవాడని తెలిపారు. ఇప్పటివరకు నంద్యాల పట్టణం, ప్రకాశం జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో మోటార్‌సైకిళ్ల దొంగతనాలకు పాల్పడ్డాడన్నారు. నిందితుడు సోమవారం నంద్యాల చెరువుకట్ట టి జంక్షన్ సమీపంలో తచ్చాడుతుండగా అదుపులోకి తీసుకొని అతడి వద్ద నుండి సుమారు రూ.15లక్షల విలువచేసే 20మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రైతు ఆత్మహత్య

వెల్దుర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అప్పులపాలైన రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని సర్పరాజపురంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన గుడిసె మనోహర్(38) తనకున్న రెండెకరాల పొలంతో పాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. గత మూడు సంవత్సరాలుగా పంటలు సరిగ్గా పండకపోవడం, అరకొరగా పండిన పంటలకు గిట్టుబాటు ధరలేకపోవడంతో అప్పులపాలయ్యాడు. సుమారుగా రూ.10 లక్షల మేర అప్పులు కావడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. దీంతో ఆదివారం అర్ధరాత్రి తన ఇంటిలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న మనోహర్‌ను కుటుంబసభ్యులు ఆటోలో వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయాడు. సోమవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.



మనోహర్ (ఫైల్)

పెద్దాసుపత్రికి ఇద్దరు కొత్త డిప్యూటీ సూపరింటెండెంట్లు



ఉత్తర్వులు అందుకుంటున్న డా.సీతారామయ్య

కర్నూలు హాస్పిటల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పరిపాలన సౌలభ్యం కోసం ఇద్దరు డిప్యూటీ సూపరింటెండెంట్లను నియమిస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం యురాలజీ సీనియర్ ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ డా.కే. సీతారామయ్య, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డా.డి. శ్రీరాములకు ఆసుపత్రి సూపరింటెండెంట్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి, రోగులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తానన్నారు.

పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 86 ఫిర్యాదులు

- విచారణ జరిపి న్యాయం చేస్తాం
- ఎస్పీ జి. బిందు మాధవ్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జి.బిందు మాధవ్

కర్నూలు క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ జి. బిందు మాధవ్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 86 ఫిర్యాదులు వచ్చాయి.

- గూడూరుకు చెందిన సుభాకర్ ఎమ్మిగనూరులో యోగా టీచర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.6లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలుకు చెందిన శ్వేతారెడ్డి ఫిర్యాదు చేశారు.
- పొట్లపాడు గ్రామానికి చెందిన నాగరాజు ఏపీ మోడల్ స్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తామని రూ.5 లక్షలు తీసుకుని మోసం చేశాడని దేవనకొండ మండలం, వెంకటాపురం గ్రామానికి చెందిన అన్వేష్ ఫిర్యాదు చేశారు.
- పొలం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని చెప్పి మహేష్ రూ.2.65 లక్షలు తీసుకుని మోసం చేశాడని దేవనకొండ మండలం పల్లెదొడ్డి గ్రామానికి చెందిన భీమలింగడు ఫిర్యాదు చేశారు.
- తన బిడ్డ పద్మావతిని అల్లుడు శేఖర్ తీవ్రంగా గాయపరిచాడని, న్యాయం చేయాలని వెల్దుర్తి మండలం బాగోలి గ్రామానికి చెందిన సోమేష్ ఫిర్యాదు చేశారు.
- ప్లాట్ కొనడానికి రూ.50 లక్షలు కట్టామని, అయితే ప్లాట్ రిజిస్ట్రేషన్ కాదని చెప్పాదని, తిరిగి డబ్బు ఇవ్వకుండా కర్నూలుకు చెందిన వసంతకుమారి బెదిరిస్తున్నదని కర్నూలు గురు రాఘవేంద్రనగర్‌కు చెందిన రామ్మోహన్ ఫిర్యాదు చేశారు.
- తన ప్రమేయం, సంతకం లేకుండానే తన బావ ప్రసాద్, క్రెడిట్ కార్డు లోన్ రూ.5 లక్షలు, బిజినెస్ లోన్ రూ.1లక్ష తీసుకుని తిరిగి కట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వెల్దుర్తికి చెందిన రాజేష్ ఫిర్యాదు చేశారు.
- ఇల్లు కట్టించి ఇస్తామని చెప్పి జాయ్ హోమ్స్‌కు చెందిన చంద్రకంటి రామకృష్ణ అలియాస్ కిషన్ డబ్బులు తీసుకుని ఇబ్బందిపెడుతున్నాడని కర్నూలు గణేష్ నగర్‌కు చెందిన మల్లికార్జున ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదులన్నింటినీ పరిష్కరిస్తానని ఎస్పీ జి. బిందుమాధవ్ హామీ ఇచ్చారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

కాల్వలను పూడ్చేశారు



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

పాములపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే అధికారులు పంట కాల్వలను పూడ్చేయడంతో ఇబ్బంది పడుతున్నామని రైతులు అన్నారు. సోమవారం డిప్యూటీ తహసీల్దార్ పఠాన్ బాబుకు సోమవారం వినతిపత్రం అందించారు. రైతులు మాట్లాడుతూ నేషనల్ హైవే విస్తరణ పనుల్లో పాములపాడులోని తహసీల్దార్ కార్యాలయం వైపున పంట కాల్వలు పూడ్చడంతో దాదాపు 60 ఎకరాలకు సాగునీరందడం లేదన్నారు. హైవే అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. వెంటనే పూడ్చిన కాల్వలను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చాలి



ప్రజాపోరు యాత్రలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఎం నాయకులు ఏసురత్నం, రణధీర్, రజాక్‌లు పేర్కొన్నారు. సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు యాత్ర పట్టణంలోని గరీబ్‌నగర్, స్వరాజ్‌నగర్, ఇందిరానగర్, సాయిబాబానగర్, అక్కిరాజుకాలనీ, పద్మావతినగర్‌లలో కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని అన్నారు. అదేవిధంగా ట్రూఆఫ్ చార్జీలపై పేరుతో రూ.20వేల కోట్ల విద్యుత్ ఛార్జీల భారాలను ప్రజలపై మోపడం సరికాదని అన్నారు. ఉచిత ఇసుక ఇస్తామని ప్రకటించినప్పటికీ ఇసుక లభ్యమవ్వడం లేదని తెలిపారు. కొత్త మద్యం పాలసీ పేరుతో ఊరురా బెల్ట్ షాపులను ఏర్పాటు చేసి ప్రజలను మద్యానికి బానిసగా మారుస్తున్నారని ఆరోపించారు. 14న తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రామ్‌నాయక్, నాగేశ్వరరావు, ఇస్మాయిల్, హుసేన్, కిరణ్ ఉన్నారు.

మహానంది.. భక్త జన సంద్రం

● శివ నామస్మరణతో మార్మోగిన క్షేత్రం ● దీపాలు వెలిగించిన మహిళలు



మహానందిలో దర్శనం కోసం క్యూలో భక్తులు



రుద్ర కోటేశ్వరాలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మహానంది, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండో సోమవారం వేలాది మంది భక్తులతో మహానంది క్షేత్రం జనసంద్రంగా మారింది. తెల్లవారుజామున 3 గంటలకు ప్రధాన ఆలయాల్లో ప్రాతఃకాల పూజలను నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలోని కోనేర్లల్లో భక్తులకు కార్తీక పుణ్య స్నానాలకు అనుమతిచ్చారు. ఆలయ పరిసరాల్లో మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. శివనామస్మరణతో క్షేత్రం మార్మోగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎర్రమల్ల మధు పర్యవేక్షించారు.

ఆత్మకూరు రూరల్: కార్తీక సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని నల్లమల అభయారణ్యంలో వెలసిన రుద్రకోటేశ్వరాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయంలో వెలసిన రుద్రాణిసహిత రుద్రకోటేశ్వర స్వామి అమ్మవార్లకు ప్రాతఃకాల సమయంలోనే ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేశారు. రాత్రి మహిళల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు.


బండిఆత్మకూరు: మండలంలోని ఓంకార క్షేత్రంలో ఈవో నాగప్రసాద్ ఆధ్వర్యంలో రెండో సోమవారం అర్చకులు గంగా, ఉమా సమేత సిద్ధేశ్వర స్వామి వార్లకు అభిషేకాలు చేశారు. అనంతరం పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పంచబుగ్గల కోనేటిలో స్నానాలు ఆచరించి, స్వామి వారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. అభయాంజనేయుడికి ప్రదక్షిణలు చేసి, అనంతరం ఎత్తైన కొండలపై వెలసిన పద్మావతి సహిత శ్రీనివాసుడ్ని కాలినడకన వెళ్లి దర్శించుకున్నారు. కాశిరెడ్డినాయన ఆశ్రమంలో అన్నదానం చేశారు.

డోడవ సోమవారం పురస్కరించుకొని పట్టణంలోని అన్ని శివాలయాల్లో ఉదయాన్నే భక్తులు కార్తీక పుణ్య స్నానాలు ఆచరించిప్రాతఃకాలపూజలు నిర్వహించారు. ప్రథమ నందీశ్వరాలయానికి భక్తులు క్యూకట్టారు. ఆలయ పరిసరాల్లో మహిళలు భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలు, ఆకాశదీపాలను వెలిగించారు.

గడివేముల: కార్తీకమాస రెండో సోమవారం పురస్కరించుకొని మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలోని పంచకోనేర్లలో స్నానమాచరించి దుర్గాభోగేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్యామ్‌సుందర్‌శర్మ దుర్గాభోగేశ్వరుడికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు.



ఓంకారంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



దుర్గా భోగేశ్వరంలో పూజలు చేస్తున్న భక్తులు



కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలోని నల్లమలలో కొలువైన సరస్వతి అమ్మవారి క్షేత్రంలో భక్తజన సందడి నెలకొంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ ఈవో రామలింగారెడ్డి ఆదేశాల మేరకు పురోహితులు ప్రాతకాల సమయంలోనే అమ్మవారిని చారుఘోషిణీ నదిజలాలచే అభిషేకించారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలు చేసిన అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. అలాగే సప్త శివాలయాల్లో శివునికి ప్రత్యేక అభిషేకాలు, పుష్పార్చన, సహస్ర నామార్చన, బిల్వార్చన తదితర పూజలు నిర్వహించారు. అలాగే మహిళలు ఆలయ ప్రాంగణాల్లో కార్తీక దీపాలు వెలిగించారు.



మహానందిలో సామూహిక అభిషేకాల్లో భక్తులు



గడివేముల: కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ప్రథమ నందీశ్వరునికి అభిషేకం చేస్తున్న భక్తులు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

కొత్తపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ఉన్న ప్రజల సమస్యల పరిష్కారంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేయరాదని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. సోమవారం కొత్తపల్లిలో ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ప్రజల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని అధికారులకు తెలిపారు. గత నెలలో కొత్తపల్లి మండలం కేంద్రంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులపై పరిష్కారం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశానికి నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ముఖ్యఅతిథిగా పాల్గొని సమస్యల పరిష్కారం కోసం పని చేయాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఆదేశాల మేరకు మండలంలో ప్రతి అర్జీదారుని సమస్యను పరిష్కరించాలని వీఆర్వోలకు తెలియజేశామన్నారు. అలాగే సాగునీటి సంఘాల ఎన్నికల కోసం అధికారులతో మాట్లాడి ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, ఇరిగేషన్ ఏఈ గౌతమ్, ఆర్ఐ, వీఆర్వోలు ఉన్నారు.

వైభవంగా గాయత్రి ఆలయ వార్షికోత్సవం

ఆత్మకూరురూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు మండలం కరివేన గ్రామంలో వెలసిన గాయత్రిమాత ఆలయంలో సోమవారం వార్షికోత్సవ వేడుకలను గ్రామస్థుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వేద పండితులు గరుడాద్రి భానుమూర్తి, గరుడాద్రి సత్యనారాయణ శర్మల ఆధ్వర్యంలో గాయత్రి మాతకు ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తజనసందోహం నడుమ అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు.



అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు తరలివస్తున్న మహిళలు

గుండె పోటుతో ఉపాధి కూలీ మృతి

ఆత్మకూరురూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలం ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి (56) అనే ఉపాధి కూలీ గుండె పోటుతో సోమవారం మృతి చెందాడు. ఆత్మకూరు మండలం ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి అనే ఉపాధి కూలీ తన తోటి ఉపాధి కూలీలతో కలిసి ఇందిరేశ్వరం గ్రామ శివార్లలోని పని నిమిత్తం బయలుదేరి వెళ్లారు. పని ప్రాంతానికి సమీపంలోకి చేరుకోగానే నడుచుకుంటూ వెళ్తున్న గోపాల్‌రెడ్డి గుండెపోటుకు గురయ్యాడు. దీంతో తోటి కూలీలు హుటాహుటిన గోపాల్‌రెడ్డిని స్థానిక వైద్యశాలకు తరలించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. మృతుడు గోపాల్‌రెడ్డికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. గోపాల్‌రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గౌడ శ్మశాన వాటిక ధ్వంసం



కూలిపోయిన శ్మశాన వాటిక ప్రహరీని పరిశీలిస్తున్న గౌడ సామాజిక వర్గం నాయకులు

నందికొట్కూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలో గౌడ శ్మశాన వాటిక ప్రహరీ(గోడ), ముఖద్వారాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కూల్చి వేయడం బాధాకరమని జై గౌడ సేవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జువ్వాజీ చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలోని శాంతి థియేటర్ వెనుకభాగంలో సర్వే నెంబర్ 487-ఎ లోని 1.80 ఎకరాల్లో గౌడ శ్మశాన వాటికను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయ మాట్లాడుతూ గత 40 సంవత్సరాల నుంచి గౌడ కులస్తులు ఈ శ్మశాన వాటికనే వాడుతున్నారన్నారు. కానీ కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసేందుకు ఏకంగా శ్మశాన వాటికలను కూడా కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. శ్మశాన వాటిక ప్రహరీని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జై గౌడ సేవ నంద్యాల జిల్లా అధ్యక్షులు పిట్ట ఎల్లగౌడ్, కర్నూలు జిల్లా అధ్యక్షులు సూర్య నారాయణ గౌడ్, సిద్దు గౌడ్, శ్రీనివాసులు గౌడ్, స్మశాన వాటిక వద్ద సంఘటన స్థలాన్ని పరిశీలించి నందికొట్కూరు పట్టణ సి.ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.

నంద్యాల డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి

నంద్యాల క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన 1996 బ్యాచ్‌కు చెందినవారు. ఎస్సైగా పోలీస్ శాఖలో చేరి 2007లో సీఐగా పదోన్నతి పొంది కర్నూలు జిల్లాలో పలు చోట్ల విధులు నిర్వర్తించారు. 2020లో డీఎస్పీగా పదోన్నతి పొంది పత్తికొండలో విధులు నిర్వర్తించారు. బదిలీల్లో భాగంగా నంద్యాల డీఎస్పీగా శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ డీజీపీ ద్వారకా తిరుమల రావు ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిని టూ టౌన్ సీఐ ఇస్మాయిల్, ఎస్సైలు సుధాకర్‌రెడ్డి, సురేష్, డీఎస్పీ కార్యాలయ సిబ్బంది జంబులయ్య, సురేష్‌రెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాల అదుపునకు, నేరాల అదుపునకు కృషి చేస్తామన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ఆత్మకూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని వడ్లరామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున అన్నారు. సోమవారం ఆయన పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వడ్లరామాపురంలో జడ్పీ హైస్కూల్‌లో సుమారు 200 నుంచి 250 మంది విద్యార్థులు ఉన్నారని అన్నారు. అయితే అక్కడ విద్యార్థులకు అవసమయ్యే కనీస సదుపాయాలు లేవని తెలిపారు. విద్యార్థులకు సరిపడే తరగతులు లేక ఆరుబటయ కూర్చోవాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. ఆట స్థలం కూడా లేదని, పాఠశాల కోసం అదనపు గదులను నిర్మించినప్పటికీ ఆ పనులు పూర్తి కాలేదని తెలిపారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



డీటీ గురునాథంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బండి ఆత్మకూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వరి రైతులకు తక్షణమే గిట్టుబాటు ధర కల్పించాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బండిఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా డీటీ గురునాథంకు వినతి పత్రం అందజేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు సుధాకర్‌రెడ్డి, రామచంద్రుడు, డేవిడ్, రాజు, బసిరెడ్డి, అబ్రహం, రవిబాబు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

వెలుగోడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీవో మధుసూధన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యలయయంలో పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలని తెలిపారు కార్యక్రమంలో ఈవోఆర్డీ గంధం మురారి పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, నవంబరు 11(ఆంధ్రజోతి): శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం రంగారెడ్డి జిల్లాకు చెందిన బి. నిరంజన్‌రావు అనే భక్తుడు కుటుంబ సమేతంగా కలిసి రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షకులు టి. హిమబిందుకు అందజేశారు. దాతలకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

● కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారతదేశపు తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యాభివృద్ధి కోసం అందించిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం నంద్యాలలోని మున్సిపల్ టౌన్‌హాలులో అబ్దుల్ కలాం ఆజాద్ 137వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మౌలానా అబ్దుల్‌కలాంఆజాద్ చిత్రపటానికి కలెక్టర్, ఇతర ప్రజాప్రతినిధులు పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అబ్దుల్‌కలాంఆజాద్ దేశప్రగతికి, దేశఅభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన కళానృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం మౌలానా అబ్దుల్‌కలామ్ ఆజాద్ చిత్రపటాన్ని ఆవిష్కరించి, గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి, మైనార్టీ సంక్షేమశాఖ అధికారి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పాల్గొన్నారు.



మౌలానా అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నందికొట్కూరు: మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి వేడుకలను నందికొట్కూరులో టీడీపీ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి డా.కాకరవాడ చిన్న వెంకటస్వామి ఆధ్వర్యంలో ఉర్దూ అకాడమి మాజీ డైరెక్టర్ అబ్దుల్ సుకూర్, తదితర నాయకులు కలిసి పట్టణంలోని అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అబ్దుల్ సుకూర్, తదితరులు పాల్గొన్నారు.

● ఆంధ్ర విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో అబుల్ కలాం ఆజాద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ దేశ తొలి విద్యాశాఖామంత్రి జయంతిని జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గోవిందు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు పాణ్యంలో టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాణ్యం బీసీ కాలనీ సమీపంలోని ఎన్టీఆర్ షాదిఖానాలో సోమవారం టీడీపీ జిల్లా ముస్లీం మైనార్టీ కార్యవర్గ సభ్యులు ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో ఆజాద్ చిత్రపటానికి పూలామాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ మాజీ నియోజకవర్గ కార్యదర్శి మహబూబ్ బాష, షాదిఖానా కమిటీ సభ్యులుషాకీర్, హుశేన్ బాషా, మహమ్మద్ రఫీ, ఖాజా, అక్బర్, దస్తగిరి పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

హిందూ, ముస్లింల ఐక్యతకు కృషి



ఆళ్లగడ్డలో ఆజాద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అమీర్ బాషా, ఉపాధ్యాయులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : దేశంలో హిందూ, ముస్లింల ఐక్యతకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎనలేని కృషి చేశారని ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు అమీర్ బాషా అన్నారు. తొలి విద్యాశాఖ మంత్రి, భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి సందర్భంగా పడకండ్లలోని కేపీజీ హైస్కూల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సోమవారం నివాళి అర్పించారు. ఉపాధ్యాయులు రఫి, శుభ దేవి, కల్యాణి, సుబ్బమ్మ, అశ్విని, లక్ష్మీరెడ్డి, జమాల్ బాషా, నరసింహులు, జయకర్ పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణంలోని కార్పెంటర్ యూనియన్ కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి అధ్యక్షుడు చాంద్‌బాషా నివాళులర్పించారు. విద్యార్థులకు జామెంట్రీ బాక్స్‌లను అందించారు. కార్యక్రమంలో మహ మ్మద్‌హుసేన్, మౌలానా, ఖాదర్‌భాష, సమద్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

డోన్ రూరల్: పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ విద్యాదినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మావతమ్మ, సీనియర్ ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే చర్యలు

చాగలమర్రి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని జిల్లా క్వాలిటీ కంట్రోల్ ఈఈ మురహరరెడ్డి అన్నారు. సోమవారం మల్లెవేముల గ్రామం నుంచి కలుగొట్లపల్లె గ్రామానికి రూ.కోటితో 3 కి.మీ రోడ్డు నాణ్యత పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ వెంకటరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ డీఈ మోహన్‌రావు, ఏఈ కొండారెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చాగలమర్రి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేపీ తండా గ్రామంలో గొర్రెలకు వ్యాధినిరోధక టీకాలను వేసినట్లు పశుసంవర్థక శాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. వంద గొర్రెలు మృతి అన్న శీర్షిక సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన పశువైద్యులు సాయిబాబా, రవీంద్రారెడ్డిలు గొర్రెలకు వ్యాధినిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'కార్యకర్తలందరూ సభ్యత్వం తీసుకోవాలి'

చాగలమర్రి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కార్యకర్తలు సభ్య త్వ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని టీడీపీ ప్రధాన కార్యదర్శి అనిఫ్, విద్యా కమిటీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ అన్నారు. సోమవారం చాగలమర్రి పాత బస్టాండులో టీడీపీ నాయకుడు మౌళాలి ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జెట్టి నాగరాజు, ఉసేన్‌సావలి, మహమ్మద్, మాబు, అబ్దుల్లా, మాబాష, యూత్‌సభ్యులు పాల్గొన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు ఆవుల నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేయించారు.

విద్యార్థుల ఆధార్ డేటా నమోదు

చాగలమర్రి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఆధార్ డేటా నమోదును సోమవారం జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాలల అధికారి రఘురామిరెడ్డి పరిశీలించారు. చాగలమర్రి ఎమ్మార్సీ కార్యాలయంలో విద్యార్థుల ఆధార్ డేటాను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అపార్ ద్వారా విద్యార్థుల ఆధార్‌ను పరిశీలిస్తున్నామని అన్నారు. జిల్లాలో 3.14 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని, వారి ఆధార్ నమోదు అయిందన్నారు. వారందరికి శాశ్వత సంఖ్య నమోదు చేసేందుకు అపార్‌ను నమోదు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో అనూరాధ, సీఆర్పీ అమీర్‌ఖాన్ ఉన్నారు.

ఆటో బోల్తా: ఇద్దరికి తీవ్ర గాయాలు

రుద్రవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలమూరు, నరసాపురం గ్రామంలో సోమవారం ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఆటో ఆళ్లగడ్డ వైపు నుంచి ఆలమూరు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆలమూరు గ్రామానికి చెందిన కత్తి హుసేన్, మధు అనే ఇరువురు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

ఇసుక ట్రాక్టరు స్వాధీనం

రుద్రవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రాయల్టీ లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. కడప జిల్లా జమ్మలమడుగు ప్రాంతం నుంచి మండలంలోని ఎర్రగుడి దిన్నెకు తరలిస్తుండగా మార్గమధ్యంలో స్వాధీనం చేసుకున్నామన్నారు. రాంభూపాల్‌రెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రుద్రవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులవరం గ్రామ సమీపంలో పేకాట స్థావరాలపై సోమవారం దాడులు చేసినట్లు ఎస్ఐ వర ప్రసాద్ తెలిపారు. దాడిల్లో తొమ్మిదిమందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4690 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బేతంచెర్ల: మండలంలోని హెచ్.కొట్టాల గ్రామం సమీపంలోని చెలిమి దగ్గర 19 మంది కోడి పందేలు ఆడుతున్న వారిపై ఎస్ఐ రమేష్‌బాబు తన పోలీసు సిబ్బందితో సోమవారం దాడులు నిర్వహించారు. 19మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,900లు, 18 బైకులు, 11 సెల్‌ఫోన్లు, నాలుగు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



చాగలమర్రి గుంతపాలెం జగనన్న లేఔట్‌లో కంపచెట్లు



జగనన్న లేఔట్‌లో పడేసిన చెత్తాచెదారం

అడవిలా జగనన్న లేఔట్లు

- ఏపుగా పెరిగిన కంప చెట్లు
- ఇళ్ల స్థలాల పక్కనే శ్మశాన వాటిక
- ఆగిన గృహ నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు



బేస్‌మెంట్‌కే పరిమితమైన ఇళ్లు

చాగలమర్రి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గుంతపాలెం వీధి సమీపం లో ఉన్న జగనన్న కాలనీ కంప చెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పె రిగి చిన్నపాటి అడవిని తలపిస్తోం ది. గత వైసీపీ ప్రభుత్వంలో గుంత పాలెం రహదారిలో జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. 194 మంది లబ్ధి దారులకు గృహాలు ఇచ్చారు, కానీ ప్రారంభించే సమయంలో రహదా రులు, విద్యుత్ స్తంభాలు లబ్ధిదా రు ల గృహాలకు ప్లాట్లు చూ పించి వది లేశారు. ఆరుగురు మాత్రమే భవ నాలు పూర్తి చేశారు. 122 మంది బేస్ మెంట్లు వేసి వదిలేశారు. 54 మంది లబ్దిదారులు గృహాల పను లు చేపట్టలేదు. 12 మంది లబ్ధిదా రుల గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. 10 మంది పైగా లబ్ధిదా రులు ఇళ్లు నిర్మించుకోకుం డానే స్థలాలను అమ్ముకున్నట్లు సమా చారం. జగనన్న కాలనీ ముళ్ల పొద లతో నిండిపోయింది. వర్షం పడితే కాలనీలో రహదారులు బురదగుం టలుగా మారుతున్నాయి. కాలనీ సమీపంలోనే శ్మశాన వాటిక ఉంది. గ్రామంలోని చెత్తాచెదారం ట్రాక్టర్లతో తీసుకెళ్లి జగనన్న లేఔట్ల మధ్యలో పడేశారు. చెత్తాచెదారానికి నిప్పు పెట్టడంతో పొగ నిండుకుంటుంది. గృహాలు నిర్మించుకోకపోవడంతో కాలనీలో ముళ్లకంపలు పెరిగాయి. నివాసయోగ్యం కానిచోట్ల ఇళ్ల పట్టాలు, పక్కా గృహాలు పంపిణీ చేయడం వల్ల ఈ దుస్థితి నెలకొందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గత ప్రభుత్వ పాలకులు లబ్దిదారుల బాగోగుల గురించి పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి జగనన్న లేఔట్ పరిశీలిస్తే లబ్ధిదారుల సమస్యలు వెలుగు చూస్తాయి.

రాష్ట్రాభివృద్ధికి దిక్సూచిగా బడ్జెట్

- రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి దిక్సూచిగా ఉందని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంఎస్ఆర్ కార్యాలయంలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మొదటిసారి అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ స్వర్ణాంధ్ర సాధనకు బాటలు వేస్తుందన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలందరి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ కేటాయింపులు చేశార న్నారు. సూపర్ సిక్స్ పథకాలు వ్యవసాయం ఆరో గ్యం, చేనేత, కులవృత్తులకు బడ్జెట్‌లో పెద్దపీట వేశారన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై పూర్తి దృష్టి సారించి బడ్జెట్‌లో నిధులు కేటాయించడం శుభ పరిణామమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ నిరాశ పరిచిందని మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శించడం సిగ్గుచేటన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ప్రజలు విసిగిపోయి 11 సీట్లకే పరిమితం చేసినా మాజీ మంత్రి బుగ్గనకు ఇంకా బుద్ధి రాలేదన్నారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరు కానీ వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులకు బడ్జెట్ పై మాట్లాడే హక్కు కూడా లేదన్నారు.

ఆలయాల్లో కార్తీక పూజలు



యాగంటిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

బనగానపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా లోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి క్షేత్రం వేలాది మంది భక్తుల రాకతో శివ నామస్మరణంతో హోరెత్తింది. కార్తీక రెండవ సోమవారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు యాగంటికి తరలి వచ్చి యాగంటి బసవేశ్వరున్ని, ఉమా మహేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఈవో చంద్రుడు, మౌళీశ్వరరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు. దేవదాయశాఖ భక్తులకు ఎస్ఐ దుగ్గిరెడ్డి, పోలీస్ సిబ్బంది బందోబస్తును పర్యవే క్షించారు. అలాగే మండలం లోని రామతీర్థంలో వెలసిన బుగ్గ రామేశ్వ రస్వామి ఆలయం, పలుకూరు రామేశ్వ రస్వామి ఆలయం, పను పుల గ్రామం వద్ద వెలసిన గుండం మల్లిఖార్జునస్వామి ఆలయం, బన గానపల్లె పట్టణంలోని శివాల యాలు, మండలంలోని గ్రామాల్లోని శివాలయాల్లో అభిషేకాలు, అర్చనలు భక్తులు నిర్వహించారు. ఆయా శివాలయాలు శివనామస్మరణతో హోరెత్తాయి.


యాగంటిలో ఘనంగా పల్లకీసేవ

బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వరస్వామి పల్లకీ సేవ ఉత్సవం నిర్వహిం చారు. ఆలయ ఈవో చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, మౌళీశ్వరరెడ్డి, సిబ్బంది, భక్తులు, ఆలయ పూజారులు పల్లకీలో శ్రీ ఉమామహేశ్వ రస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

కొలిమిగుండ్ల: కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా వివిధ గ్రామాల్లో వెలసిన ప్రసిద్ధ శైవక్షేత్రాల్లో కార్తీక దీపం వెలుగులు సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా కొలిమిగుండ్ల లలితాసుందరేశ్వరస్వామి, నేల బిలం మల్లేశ్వరస్వామి, గుండు మల్లేశ్వర స్వామి, సిద్ధ రామేశ్వ రస్వామి, కాచూటి విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

సిద్ధ రామేశ్వరస్వామికి ..

మండలంలోని బెలుం గ్రామంలో వెలసిన ప్రసిద్ధ సిద్ధ రామేశ్వ రస్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా పంచదార అభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మహేశ్‌శర్మ సోదరుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు తరలి రాగా, సుమారు 50కేజీల పంచ దారతో స్వామి వారికి అభిషేకం చేశారు. అనంత రం విశేష పుష్పాలంకరణ గావించి, భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.



కొలిమిగుండ్ల ప్రత్యేక పంచదార, పుష్పాలంకరణలో సిద్ధ రామేశ్వరస్వామి

కోవెలకుంట్ల: కార్తీక మాసంలో సోమవారం రోజున ప్రత్యేక బస్సు సర్వీసుల నడుపు తున్నట్లు కోవెలకుంట్ల డిపో మేనేజరు తిరుపతయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడో సోమవారం నాలుగో సోమవారం రోజున భక్తులు ప్రజలు పంచశైవ క్షేత్రాలైన కన్యతీర్థం, న యనాలప్ప, ఓంకారం, మహా నంది, మరియు యాగంటి క్షేత్రాలు దర్శించు కునేందుకు కోవెలకుంట్ల డిపో నుండి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.



కాశింతల క్షేత్రంలో..



కొలిమిగుండ్లలో..



బేతంచెర్ల: మల్లికార్జున స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రుద్రవరం: కార్తీక మాస రెండో సోమవారం శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వాసాపురం, రుద్రవరం, శ్రీరంగా పురం, యల్లావత్తుల, ఆలమూరు మందలూరు, చందలూరు గ్రామాల్లో కార్తీక మాస పూజలు చేసి మహిళలు దీపాలు వెలి గించి భక్తిని చాటారు.

ఆళ్లగడ్డ(శిరివెళ్ల): మండల పరిధిలోని పుణ్యక్షేత్రమైన కాశింతలలో మహిళలు సోమవారం తెల్లవారుజాము నుంచి ధ్వజస్తంభం వద్ద, ఉసిరి చెట్టుకు కార్తీక దీపాలు వెలిగించారు. శివ లింగానికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శిరివెళ్ల మండలంలో: మండలంలోని శిరివెళ్ల, యర్రగుంట్ల, కోటపాడు గ్రామాల్లో శివాలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. యర్రగుంట్ల గీతాశ్రమంలో గీతాపారాయణం, శివ అష్టోత్తర శత నామావళి నిర్వహించారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయం, భీమ లింగేశ్వర ఆలయంలో సోమవారం కార్తీక మాసం సందర్భంగా శివపార్వతుల పల్లకి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్ర మంలో ఆలయ అధ్యక్షుడు భాస్క రరెడ్డి, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు. అలాగే ముత్యాల పాడు శరభేశ్వరస్వామి, భైరవీశ్వర, బుగ్గమల్లేశ్వర, రామలింగేశ్వర, భీమ లింగేశ్వర ఆలయాల్లో సోమవారం రాత్రి వైభవంగా దీపోత్సవం నిర్వహించారు.

బేతంచెర్ల: మండలంలోని హెచ్.కొట్టాల గ్రామ సమీపంలోని కొండల నడుమ వెలసిన ముచ్చట్ల మల్లికార్జున స్వామి సమేత భ్రమ రాంబ అమ్మవార్లను భక్తులు కార్తీక మాస ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి దర్శించుకున్నారు.

అవుకు: పట్టణంలో వెలసిన కాశీ విశ్వనాథస్వామి ఆలయం, చెర్లోపల్లె సమీపంలో వెలసిన బుగ్గమల్లేశ్వర స్వామి ఆలయం, శివవరం గ్రామంలోని శివాలయాలవద్దకు భక్తులు భారీగా తరలివచ్చి పూజలు చేశారు. కార్తీక దీపాలను వెలిగించారు.



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రమాదాల నివారణే లక్ష్యం

- డోన్ ఆర్టీవో క్రాంతి కుమార్

డోన్ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యమని డోన్ ఆర్టీవో టి.క్రాంతి కుమార్ అన్నారు. ఇందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు పోతున్నట్లు తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు.

ప్రశ్న: డోన్ ఆర్టీవో కార్యాలయ పరిధిలో ఎన్ని మండలాలు ఉన్నాయి?

జవాబు: డోన్ ఆర్టీవో కార్యాలయం పరిధిలో బేతంచెర్ల, ప్యాపిలి, డోన్ మండలాలు ఉన్నాయి.

ప్రశ్న: అధికంగా నమోదవుతున్న కేసులు ఏవి?

జవాబు: డోన్ నియోజకవర్గంలో ప్యాపిలి, డోన్ మండలాల్లో జాతీయ రహదారులు ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికంగా టూ వీలర్లు, ట్రాక్టర్లు ప్రమాదాలకు గురవుతున్నాయి.

ప్రశ్న: కెపాసిటీకి మించి తిరిగే ఆటోలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ఆటోల్లో డ్రైవర్లతో పాటు నలుగురు ప్రయాణికులు మాత్రమే ఉండాలి. అయితే.. కొంత మంది ఆటో డ్రైవర్లు కెపాసిటీ మించి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్నారు. వీరిపై తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం. జరిమానాలు సైతం విధిస్తున్నాం. కెపాసిటీ మించి ప్రయాణం ప్రమాదకరమని అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: ప్రమాదాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ప్రమాదాల నివారణకు పూర్తి చర్యలు తీసు కుంటున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహనాలను తనిఖీ చేస్తున్నాం. వాహనాల పర్మిట్లు, ఇన్సూరెన్స్ లేకుండా తిరుగుతున్న వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నాం. అలాగే ఆటో డ్రైవర్లకు రవాణా వాహనాలు నడుపుతున్న డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రమాదాలకు కారణమైన డ్రైవర్ల లైసెన్సులను ఆరు మాసాలు సస్పెండ్ చేస్తున్నాం.

క్యాన్సర్ వ్యాధిపై ఇంటింటి సర్వే

కొలిమిగుండ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో ఈనెల 14నుంచి క్యాన్సర్ వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు హరిచరణ్‌రెడ్డి వెల్లడించారు. ఆయా గ్రామాలకు చెందిన ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ తిరిగి 18సంవత్సరాలు నిండిన మహిళల వివరాలను సేకరించి, లక్షణాలను బట్టి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అవసరమైన సామగ్రి నంద్యాల జిల్లా కేంద్రం నుంచి ఇప్పటికే స్థానిక పీహెచ్‌సీ కేంద్రానికి చేరినట్లు డాక్టర్ తెలిపారు.

కాంగ్రెస్ బనగానపల్లె సమన్వయకర్తగా బాలుయాదవ్



కోవెలకుంట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బనగానపల్లె నియోజకవర్గ సమన్వయకర్తగా జి.బాలుయాదవ్ నియమితుల య్యారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం ప్రకటించిన జాబితాలో బాలుయాదవ్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీచేశారు. కోవెలకుంట్లకు చెందిన బాలుయాదవ్ గత సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. ఈ సందర్భంగా ఆయన పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా, జిల్లా అధ్యక్షులు లక్ష్మీనరసింహయాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'టీడీపీతోనే పేదలకు న్యాయం'

కోవెలకుంట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ జిల్లా కోఆప్షన్ మెంబరు గఫూర్ అన్నారు. సోమవారం కోవెలకుంట్ల పట్టణంలో మైనార్టీ నాయకుల, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరగలేదన్నారు. టీడీపీ సభ్యత్వాన్ని పొంది అన్నివిధాలుగా లబ్ధి పొందాలని ఆయన తెలిపారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14 నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆళ్లగడ్డ గ్రంథాలయ అధికారిని అరుణ కుమారి సోమవారం తెలిపారు. పుస్తక ప్రదర్శన, పుస్తక పఠనం ప్రాముఖ్యత, మాదక ద్రవ్యాలపై అవగాహన, కవి సమ్మేళనాలు, విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాలికలు మనోధైర్యంతో ఉండాలి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : బాలికలు మనోధైర్యంతో ఉండాలని నంద్యాల శాంతిరాం వైద్యశాలకు చెందిన సైకాలజిస్ట్ డాక్టర్ సింధూజ సూచించారు. పట్టణంలోని వైపీపీఎం ప్రభుత్వ పాఠశాలలోని బాలికలకు సోమవారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఇన్నోవర్‌వీల్ తరపున డాక్టర్ సింధూజను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాఘవయ్య, ఆళ్లగడ్డ ఇన్నేర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు గాండ్ల ఉషారాణి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బనగానపల్లె సీఐగా ప్రవీణ్‌కుమార్

బనగానపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణ నూతన సీఐగా కె.ప్రవీణ్‌కుమార్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. బనగానపల్లె సీఐ కృష్ణయ్య బదిలీ కావడంతో కర్నూలు సెంట్రల్ క్రైం స్టేషన్ సీఐగా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ బదిలీపై వచ్చారు. ఎస్ఐ దుగ్గిరెడ్డి, పోలీస్ సిబ్బంది సీఐని అభినందిం చారు.

బేతంచెర్ల చేరుకున్న పాదయాత్ర



వేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల, నవంబ రు 11 (ఆంధ్రజ్యో తి) : కర్నూలు నుంచి తిరుమల తిరుప తికి బయలు దేరిన భక్తి చైతన్య పాదయాత్ర వేంకటే శ్వర స్వామి రథం బేతం చెర్లకు సోమవారం చేరుకుంది. బేతంచెర్ల పాతబస్టాండులో వేంకటేశ్వర స్వా మికి భక్తులు పూజలు చేశారు. పాదయాత్ర బనగానపల్లె నొస్సం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకురు, కడప, రాజంపేట, రైల్వేకోడూరు, తిరుచానూరు తిరుపతికి చేరుకుంటుందని వారు తెలిపారు.

అయ్యప్పస్వాములకు భిక్ష

కోవెలకుంట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అయ్యప్పమాల ధరించిన భక్తులకు రెండో సోమవారం పట్టణంలోని ఏడుకప్పిలబావి వద్ద మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వరెడ్డి స్వామి భిక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్తీక మాసంలో మాల ధరించిన అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశామన్నారు. స్వాములు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి సహకరించాలి



విద్యార్థితో మాట్లాడుతున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మాణం కోసం ప్రతీ విద్యార్థి సహకరించాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లలిత ఆధ్వర్యంలో బనగానపల్లె - నాఆరోగ్యం, అనే కార్యక్రమంలో బీసీ ఇందిరమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రజల ముందుకు వస్తున్నామని విద్యార్థులు ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. విద్యార్థులతో ముఖా ముఖి కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను బీసీ ఇందిరమ్మ విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ లలిత మాట్లాడుతూ సమాజహితం విద్యార్థులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టంగటూరు శ్రీనయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాబారావు, అధ్యాపకులు బడేసాహెబ్, సూర్యానారాయణరెడ్డి, మహమ్మద్ గౌస్, రామకృష్ణ, సుధాకర్‌రెడ్డి, వసుంధరమ్మ, నీతమ్మ, వరలక్ష్మి, నాగరాజారెడ్డి, రవికుమార్, చంద్రకళ పాల్గొన్నారు.

డోన్‌లో జాబ్‌మేళా

డోన్ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. మేళాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భారతి అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. మూడు కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థు లకు ఇంటర్వ్యూలు నిర్వహిం చారు. 65 మంది అభ్యర్థులు హాజరు కాగా, 30మంది అభ్యర్థులు అర్హతను సాధించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు

14న ఏఐఎస్ఎఫ్ మహాసభ

బేతంచెర్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో ఈ నెల 14న జరగబోయే ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి ధనుంజయ పిలుపునిచ్చారు. సోమవారం పాణ్యం సిమెంటు జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ అధ్యక్షతన మండ లం ఏఐఎస్ఎఫ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.